పండ్లు, స్వీట్లు పంపిణీ



మున్సిపల్ కార్మికులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ శారదా దేవి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంటీఎంసీ కమిషనర్ శరదాదేవి కార్మికులకు, సచివాలయ సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు, కేక్‌లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్వో మురళి, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సలహాదారు, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం లాంటి శారీరక శ్రమ చేయడం వంటి వాటితో జీవన శైలిని అలవర్చుకుంటే మంచి ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. దుహిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, షైన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, అమరావతి ఐ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ నలూరి శశిధర్, డాక్టర్ కాట్రగడ్డ వికాస్, డాక్టర్ వి.మధుకిరణ్, డాక్టర్ వేణు నాదెండ్ల టెక్నీషియన్లు ఎండీ షంషుద్దీన్ తమ సేవలను అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ ఎ.జగదీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ చప్పిడి హనుమంతరావు, పి. సురేష్ పాల్గొన్నారు.

ఉండవల్లిలో గ్రావెల్ రోడ్ నిర్మాణం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో గ్రావెల్ రోడ్ నిర్మాణానికి శనివారం పనులు చేపట్టారు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి ముగ్గురోడ్డు దగ్గర పంటపొలాల్లో ఉన్న డొంక రోడ్డులో ఇరువైపులా ఇళ్లు నిర్మించుకోవడంతో స్థానికంగా ఉన్న ప్రజలు రోడ్డు నిర్మించాలంటూ గత సోమవారం ఎమ్మెల్యే ఆర్కేకు వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన ముందు ప్రజలు రాకపోకలు సాగించేందుకు గ్రావెల్ రోడ్ నిర్మించాలని సూచించడంతో కార్పొరేషన్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

శరవేగంగా పెద్ద కోనేరు మరమ్మతులు

మంగళగిరి: శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు(కల్యాణ పుష్కరిణి) మరమ్మతులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 20 రోజులుగా పనులు నిర్వహిస్తున్నారు. కోనేరు అడుగు భాగంలో పేరుకుపోయిన బురద, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను పూర్తిగా తొలగించాల్సి ఉంది. పెద్ద కోనేరు అడుగు భాగంలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులకు వీలుపడకపోవడంతో కోనేరులో బురద పూడిక తీసేందుకు సుమారు 50 అడుగుల పొడవుగ లాంగ్‌స్టిక్, లాంగ్ భూమ్ పొక్లెయిన్‌ను రప్పించారు. ఇప్పటికే కోనేరు తూర్పు భాగంలో శిథిలమైన మెట్లను తొలగించడంతో పాటు లోపల బురద పూడిక తీసేందుకు పొక్లెయిన్ వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక రహదారి మార్గాన్ని ఏర్పాటు చేశారు.

ఖాళీ స్థలాల్లో పొదలు తొలగింపు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం శ్రీలక్ష్మీ సూర్య ఎస్టేట్స్‌లోని నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో పెరిగిన కంపచెట్ల తొలగింపు పనులు శనివారం ప్రారంభించారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పరిశీలించారు. ఇదే సందర్భంలో వాకింగ్ ట్రాక్ స్థలాన్ని కూడా పరిశీలించిన ఆయనకు పారిశ్రామిక వేత్త ఆళ్ల సురేష్, స్థానిక సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే వెంటనే కంపచెట్లను తొలగించాలని అధికారులకు సూచించారు. దీంతో శనివారం ఖాళీ స్థలాల్లో కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు.

నాలా ట్యాక్స్ వసూలుపై కసరత్తు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, మండల పరిధిలోని నాలా ట్యాక్స్ వసూలుపై తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని నాలా ట్యాక్స్ వసూళ్ల సిబ్బంది పనితీరు చాలా బాగుందని, 79 మంది పన్ను కట్టకముందే నిర్మాణాలు చేపట్టారని, అందులో కొంత మందికి అపరాధ రుసుం విధించామని, వారిని గుర్తించి మిగిలిన రుసుంను కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ వి.వి.రమణరాజు, ఆర్.ఐ. ప్రశాంతి పాల్గొన్నారు.

తాడికొండలో న్యూ ఇయర్ సందడి



తాడికొండలో మిఠాయిలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

తాడికొండ: తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో న్యూ ఇయర్ సందడి నెలకొంది. మిఠాయి దుకాణాలు, బేకరీ దుకాణాల్లో స్వీట్లు, కేకులు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపారు. దీంతో దుకాణాలు కిటకిటలాడాయి. యువత కేరింతల నడుమ అర్ధరాత్రి కేకులు కత్తిరించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళాశాలల్లో నూతన సంవత్సర వేడుకలు



నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న అధ్యాపకులు

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల పరిధిలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలల్లో నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి వై.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి, అధ్యాపకులు బి.రాంబాబు, జె.పాములు, గంగాదేవి, విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో న్యూఇయర్ వేడుకలు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలను శనివారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం విద్యార్థుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంతారావు కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.జోజప్ప, కె.రామచంద్రరావు, కె.విజయకుమారి, పి.సుజాత, కె.ఉమాదేవి, కె.పద్మావతి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

ఫిరంగిపురం: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల సెక్టారుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మరియు సహాయకురాలి పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ పి.ప్రసూన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిరంగిపురం 16వార్డు, భీమినేనివారిపాలెంలోని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు(ఓసీ), సిరిపురం కమ్యూనిటీ పాఠశాల వద్ద అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు(ఓసీ) అర్హులైన వారు జనవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ దరఖాస్తులను ఫిరంగిపురం ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.





అంతర పంటతో నల్లి నివారణ సాధ్యం


ఉల్లి పంటను పరిశీలిస్తున్న అమీనాబాద్ సెక్టార్ ఎస్ఎస్ఎఫ్ అన్నామణి

ఫిరంగిపురం: మిర్చి పొలంలో అంతర పంటలు ద్వారా నల్లి నివారణ సాధ్యమవుతుందని అమీనాబాద్ సెక్టార్ ఎస్ఎస్ఎఫ్ అన్నామణి అన్నారు. మండలంలోని మునగపాడులో శనివారం మిర్చి పొలంలో అంతరపంటగా వేసిన ఉల్లిసాగును పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నల్లి నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. రైతు దాసరి గోపి మిరప పొలంలో అంతర పంటలుగా ఉల్లి, కొత్తిమీర, ముల్లంగి వేసి దానికి బలం చేకూర్చేలా ఘనజీవామృతం 600 కేజీలు వేసినట్లు వివరించారు. దీని ద్వారా నారు శుద్ధికి భూమి నుంచి వచ్చే తెగుళ్ల నివారణకు పంట ఎదుగుదలకు జీవామృతం, పంచగవ్య లాంటి ద్రావణాలు పిచికారీ ద్వారా ఎంతో శక్తివంతంగా పనిచేస్తాయని చెప్పారు. పురుగు ఎక్కువగా ఉన్న సమయంలో పసుపురంగు, బునుగురంగు అట్టలు ఏర్పాటు చేయడం ద్వారా లద్దెపురుగు, పచ్చపురుగు నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వాటితో పాటు లింగాకర్షక బుట్టలు ఎకరంలో పది ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించామన్నారు. ఆమె వెంట లీడ్ ఫార్మర్స్, ఐసీఆర్పీ ఇ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ


గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచి తోకల సరోజినీ

తాడికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తాడికొండ సర్పంచి తోకల సరోజినీ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంబీడీ శ్యామల, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు పాల్గొన్నారు.

పోలీసు ఫైరింగ్ రేంజ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


ఫైరింగ్ రేంజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల కైలాసగిరి సమీపంలోని పోలీసు రేంజ్ ఫైరింగ్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ శనివారం పరిశీలించారు. ఫైరింగ్‌లో శిక్షణలో భాగంగా పోలీసు వ్యవస్థలో ఉన్న అన్ని రకాల ఆయుధాలు ఉపయోగించి ఫైరింగ్ శిక్షణనిచ్చారు. ప్రతి గన్‌ను పరిశీలించి, దానిలో బుల్లెట్ లోడు చేసి ఫైరింగ్ చేశారు. అన్నిరకాల మోడల్స్ తుపాకీలను ఇక్కడకు తీసుకొచ్చి ఫైరింగ్‌లో వినియోగించారు.

అంతర్గత పైపులైన్ పనులు ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన కర్ణాటక, కేరళ సెక్టార్ సీఆర్‌పీఎఫ్ డీఐజీ వీర్రాజు

తాడికొండ: తాడికొండ మండలం బడేపురం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత పైపులైన్‌ల నిర్మాణానికి సీఆర్‌పీఎఫ్ కర్ణాటక, కేరళ సెక్టార్ డీఐజీ బురదగుంట వీర్రాజు శనివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామమైన బడేపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొనసాగుతున్న అభివృద్ధి పనులలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి గ్రామానికి తాగునీటి కొరతను తీర్చాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, స్థానిక ఎంపీటీసీ పాలడుగు దాసు, ఎస్టీ సెల్ పార్లమెంటు విభాగం ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు పాల్గొన్నారు.


ఉల్లి పంటను పరిశీలిస్తున్న అమీనాబాద్ సెక్టార్ ఎస్ఎస్ఎఫ్ అన్నామణి























రేపు నృసింహుని ముక్కోటి ఏకాదశి

- జనవరి 2న ఉత్తర ద్వార దర్శనం,శంకుతీర్థం
- భక్తుల కొరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు


విద్యుత్‌కాంతులీనుతున్న ఉత్తర ద్వారం

మంగళగిరి: మంగళగిరి నూతన శోభను సంతరించుకుంది. నూతన సంవత్సరంతో పాటు ముక్కోటి ఏకాదశి వేడుకలు జనవరి 1,2 తేదీల్లో రావడంతో ప్రజలు, భక్తులు సన్నద్ధమవుతున్నారు. శనివారం రాత్రి నుంచే నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే క్రమంలో భాగంగా కేకులు, మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు, కుటుంబ సభ్యులకు, బంధువులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక 2వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారు ఉత్తర ద్వారంలో దర్శనం ఇవ్వనుండటంతో స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. బంగారు శంఖుతో భక్తులకు తీర్థం ఇవ్వనున్నారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన శంఖు తీర్థాన్ని స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు తరలిరానుండటంతో అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తకోటికి నృసింహుని దర్శనం కలిగేలా మంగళాద్రి నృసింహుని సన్నిధిని సర్వాంగ సుందరంగా తీర్చిద్దారు. శనివారం తరలివచ్చే భక్తుల కొరకు అదే రోజు రాత్రి నుంచి శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జనవరి 1వ తేదీ రాత్రి ఒంటిగంట నుంచి 3గంటల వరకు శ్రీస్వామి వారి తిరువంజనోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేరోజు తెల్లవారుజామున 4గంటల నుంచి బంగారు గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఉత్తరద్వారం (వైకుంఠద్వారం)లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. నృసింహుని దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. ఏర్పాట్లలో భాగంగా భక్తులకు తాగునీరు, ప్రసాదాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేయనుండగా నగరానికి చెందిన ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో కూడా భక్తులకు పలు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.



న్యూ ఇయర్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



మంగళగిరి: ప్రజలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నూతన సంవత్సర, ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడాదిలో నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షించారు. ఏటేటా వినూత్న పంథాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023లో ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు నిండాలని ఆకాంక్షించారు. సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.









నూతన సంవత్సర శుభాకాంక్షలు

కత్తెర సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త, తాడికొండ



తాడికొండ: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న ప్రతి ఒక్కరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

మంగళగిరి: భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నగర పరిధిలోని పెదవడ్లపూడిలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం, ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి, టుబాకో బోర్డు చైర్మన్ యడ్లపాటి రఘునాథ్ బాబు, కార్యదర్శి మాగంటి సుధాకర్, నాయకులు తాళ్ల వెంకటేష్, యడ్లపాటి స్వరూపరాణి, అమ్మిశెట్టి ఆంజనేయులు, తోట రామకృష్ణ, జగ్గారపు శ్రీనివాసరావు, జగ్గారపు రాము, ఆకురాతి నాగేంద్రం, వాసం శ్రీనివాసరావు, అందె శివశంకర్, పంచుమర్తి ప్రసాద్ పాల్గొన్నారు.







పలువురుకి సన్మానం


పోతురాజు, మురళి, నాగభూషణంలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం సాయంత్రం ప్రముఖ రంగస్థల కళాకారుడు అంబటి పోతురాజును ఘనంగా సన్మానించారు. అనంతరం ఎన్టీఆర్ రీమెక్ చిత్రాలు- సూపర్‌హిట్స్ అనే అంశంపై గోనుగుంట్ల మురళి, కంచర్ల నాగభూషణంలు ప్రసంగించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాడిబోయిన హరిప్రసాద్, కాకుమాను రాంబాబు, అలపర్తి వెంకటేశ్వరరావు, గోళ్ళ ప్రభుదాసు, కంచర్ల చంద్రశేఖర్, గిరి, కంచర్ల ఏడుకొండలు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, వెనిగళ్ళ శివన్నారాయణ ప్రసాద్, తిరుపతిరావు, దీపక్, దేవిశెట్టి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.











